వైద్య విద్యార్థినికి ఆర్థిక సాయం చెక్కు అందజేస్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

చదువుల తల్లికి చేయూత

- నిరుపేద వైద్యవిద్యార్థినికి ఎన్నారై సాయం
- కేటీఆర్ ద్వారా చెక్కు అందజేత

హైదరాబాద్, అక్టోబర్ 14 (నమస్తే తెలంగాణ): పేదరికం కారణంగా వైద్యవిద్యకు దూరం అవుతానేమోననే ఆందోళనలో ఉన్న విద్యార్థినికి ఓ ఎన్నారై ఆర్థిక చేయూతనిచ్చారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేతుల మీదుగా ఆ విద్యార్థినికి ఆర్థిక సాయం అందించారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా వీపనగండ్ల మండలంలోని కల్వరాలకు చెందిన బోరెల్లి నర్సింహ, శ్యామల పెద్దకుమార్తె గౌరికి మెదక్ జిల్లా మహేశ్వర వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ సీటు వచ్చింది. పేదరికం కారణంగా గౌరిని కళాశాలలో చేర్పించటం ఆ తల్లిదండ్రులకు భారంగా మారింది. విషయం తెలుసుకున్న ఎన్నారై దూడల వెంకట్‌గౌడ్ ఆ విద్యార్థినికి సాయం అందించేందుకు ముందుకొచ్చారు. యాదాద్రి-భువనగిరి జిల్లాకు చెందిన వెంకట్ ప్రస్తుతం అమెరికాలో ఉంటున్నాడు. పేద విద్యార్థికి సాయం అందిస్తే ఆ కుటుంబం నిలబడటమే కాకుండా మరికొంతమందికి స్ఫూర్తిగా నిలుస్తుందని భావించారు. ఇదే విషయాన్ని కేటీఆర్‌కు చెప్పారు. తన తండ్రి రవీందర్ ద్వారా ఆ విద్యార్థినికి ఆర్థిక సాయం అందిస్తానని, విద్యార్థినికి అందించాలని కేటీఆర్‌ను కోరారు. సోమవారం హైదరాబాద్‌లో విద్యార్థి, ఆమె తల్లిదండ్రులకు ఎంబీబీఎస్ మొదటి సంవత్సర ట్యూషన్ ఫీజును చెక్‌రూపంలో కేటీఆర్ అందజేశారు. కేటీఆర్ ప్రారంభించిన గిఫ్ట్ ఏ స్మైల్ తనకు స్ఫూర్తి అని వెంకట్ పేర్కొన్నారు.

పట్టుదలతో ఎదగాలి

పట్టుదలతో ఎదిగి పది మందికి ఆదర్శంగా నిలవాలని కేటీఆర్ ఈ సందర్భంగా విద్యార్థి గౌరికి సూచించారు. తల్లిదండ్రుల కష్టాన్ని చూసి ముందుకొచ్చిన దాత ఉద్దేశాన్ని గమనంలోకి తీసుకొని ఎదగాలన్నారు. ఈ సందర్భంగా గౌరి కేటీఆర్‌కు కృతజ్ఞతలు చెప్పబోతుంటే వారించారు. కష్టపడి చదివి ఇంటికి వెలుగు తీసుకురావటమే కాకుండా సాయం అందించేందుకు ముందుకు వచ్చిన వారికి స్వీట్ ఇచ్చి థ్యాంక్స్ చెప్పాలని సూచించారు. ఈ సందర్భంగా ఎన్నారై వెంకట్, ఆయన తండ్రి రవీందర్‌కు విద్యార్థిని, ఆమె తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

18న కేటీఆర్ వాంగ్మూలం

- కొండా సురేఖపై పరువు నష్టం దావాలో కోర్టు ఆదేశం

హైదరాబాద్ సిటీబ్యూరో, అక్టోబర్ 14 (నమస్తే తెలంగాణ): కొండా సురేఖపై పరువు నష్టం దావా వేసిన మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను వాంగ్మూలం ఇచ్చేందుకు ఈ నెల 18న హాజరు కావాలని నాంపల్లి స్పెషల్ మేజిస్ట్రేట్ కోర్టు సోమవారం ఆదేశాలు జారీ చేసింది. సినీ నటులు నాగచైతన్య, సమంతల విడాకుల విషయంలో కేటీఆర్‌పై కొండాసురేఖ అనుచిత వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. ఈ వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తం చేసిన కేటీఆర్ మంత్రిపై పరువు నష్టం దావా వేశారు. ఈ కేసుపై సోమవారం విచారణ జరిపిన కోర్టు కేటీఆర్‌తో పాటు నలుగురు కీలక సాక్షులు బాల్క సుమన్, సత్యవతి రాథోడ్, తుల ఉమ, దాసోజు శ్రవణ్‌లను వాంగ్మూలం ఇచ్చేందుకు 18న రావాలని ఆదేశించింది.

ప్రభుత్వ పథకాలు కాంగ్రెస్సోళ్లకే ఇస్తం

- వాళ్లు చెప్పింది చెయ్యకుంటే నా ఉద్యోగం పోతది
- కాంగ్రెస్ నాయకులు వచ్చి చెప్తేనే సంతకం పెడ్తా
- సామాన్యుడితో ఫోన్‌లో మునిపల్లి ఎంపీడీవో
- సీక్రెట్‌గా 23 ఎస్సీ రుణాల దరఖాస్తుల స్వీకరణ
- సామాజిక మాధ్యమాల్లో ఆడియో క్లిప్పులు వైరల్

మునిపల్లి, అక్టోబర్ 14: సాధారణంగా ప్రభుత్వ పథకాలు ఎవరికి దక్కాలి? ఆయా వర్గాల్లో అర్హులకు అందాలి!. కానీ, ఈ ప్రభుత్వంలో అందంతా తూచ్..! మీరు కాంగ్రెస్ నాయకులో, కార్యకర్తనో అయ్యుంటేనే వర్తిస్తాయ్! ఇందుకు సంగారెడ్డి జిల్లా మునిపల్లి ఎంపీడీవోనే సాక్ష్యం మరి! ఎందుకంటే ఇది స్వయంగా చెప్పింది సాక్షాత్తూ ఆయనే కాబట్టి! ఓ సాధారణ వ్యక్తి తనకు ఎస్సీ కార్పొరేషన్ లోన్ కోసం సంతకం కావాలని ఎంపీడీవోను ఫోన్ చేసి కోరితే ఆయన ససేమిరా అన్నాడు. పైగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అయ్యుంటేనే.. లేదా కాంగ్రెస్ నాయకులు వచ్చి చెప్తేనే సంతకం చేస్తానని కుండబద్దలు కొట్టాడు. ఇక్కడ విస్తుపోవడం ఆ సామాన్యుడి వంతయింది.

సంతకం పెట్టి నేను ఇబ్బంది పడ..

సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలంలో ఓ సామన్య వ్యక్తి మునిపల్లి ఎంపీడీవోకు ఫోన్‌చేసి 'సార్ నమస్కారం.. నాకు ఎస్సీ కార్పొరేషన్ లోన్ కోసం సంతకం కావాలి సార్' అని ఎంపీడీవో హరినందన్‌రావుకు కాల్ చేశాడు. దీనికి ఎంపీడీవో బదులిస్తూ 'నేను సంతకం పెట్టను.. సంతకం పెట్టి ఇబ్బందులు పడను.. కాంగ్రెస్సోళ్లు చెప్తే సంతకం పెడుతా లేదంటే పెట్టా' అని కరాఖండిగా చెప్పేశాడు.

కాంగ్రెస్సోళ్లకే ఇవ్వాలన్నారట!

'మునిపల్లి మండలానికి వచ్చిన ఎస్సీ కార్పొరేషన్ యూనిట్లను కేవలం మండలంలోని కాంగ్రెస్ కార్యకర్తలకు మాత్రమే ఇవ్వాలని మాకు ఆదేశాలున్నయ్. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మేం కాంగ్రెస్ నాయకులకే దరఖాస్తు ఫారాలు ఇస్తున్నం. మండలంలో ఎలాంటి నోటిఫికేషన్లు వేయకుండా సీక్రెట్‌గా దరఖాస్తులు తీసుకోమన్నారు. మండలంలో ఎలాంటి నోటిఫికేషన్లు వేయలేదు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలకు కాకుండా ఇతరులకు లోన్లు ఇవ్వాలంటే మునిపల్లి ఎంపీడీవో కార్యాలయానికి కాంగ్రెస్ నాయకులు వచ్చి వీళ్లు మా వాళ్లే వీళ్లకు లోన్ ఇవ్వండి అంటే అప్పుడు సంతకం పెడ్తా' అని ఎంపీడీవో హరినందన్‌రావు ఫోన్‌లో మాట్లాడిన ఆడియో క్లిప్పులు మునిపల్లి మండలంలో వివిధ సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి.

గుట్టుచప్పుడు కాకుండా 23మందికి దరఖాస్తులు

మునిపల్లి మండల పరిషత్ కార్యాలయంలో ఎలాంటి పేపర్ స్టేట్‌మెంట్లు లేకుండా 15 రోజులుగా ఎస్సీ కార్పొరేషన్ దరఖాస్తుల స్వీకరణ కొనసాగుతున్నది. ఇంత జరుగుతున్నా ఉన్నతాధికారుల నిర్లక్ష్యంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దరఖాస్తు ఫారాలు సైతం కేవలం కాంగ్రెస్ నాయకులకే అందిస్తున్నారు. ఇతరులెవరు వెళ్లినా దరఖాస్తులు లేవని తిప్పి పంపిస్తున్నారు. ఎలాంటి నోటిఫికేషన్ లేకుండా ఎస్సీ కార్పొరేషన్ దరఖాస్తులు స్వీకరిస్తున్న మునిపల్లి ఎంపీడీవో హరినందన్‌రావుపై చర్యలు తీసుకోవాలని మండల వాసులు కోరుతున్నారు. ఇప్పటికే గుట్టుచప్పుడు కాకుండా 23 దరఖాస్తులను స్వీకరించినట్టు తెలిసింది.

సీఎం వద్దకు పంచాయితీ

- సురేఖ, రేవూరి లొల్లిపై ఆరా
- మంత్రి, ఎమ్మెల్యేతో మాట్లాడిన పీసీసీ చీఫ్
- పిలిచేదాకా సంయమనంతో ఉండాలని సూచన
- మంత్రి కొండా సురేఖ వరుస వివాదాలు
- ఉమ్మడి వరంగల్ జిల్లా ఎమ్మెల్యేలతో విభేదాలు
- ప్రత్యేకంగా విచారిస్తున్న కాంగ్రెస్ హైకమాండ్

వరంగల్, అక్టోబర్ 14 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఇటీవలి చర్యలు, మాటలతో వివాదాస్పద మంత్రిగా మారిన కొండా సురేఖ, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి మధ్య పంచాయితీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వద్దకు చేరింది. సినీ హీరో నాగార్జున కుటుంబంపై అవాకులు, చెవాకులు మాట్లాడటం, దసరా ఫ్లెక్సీల్లో ఫొటోలపై పంచాయితీకి దిగడం, ఉమ్మడి వరంగల్ జిల్లాలోని అధికార పార్టీ ఎమ్మెల్యేలతో విభేదాలు వంటి అంశాలపై మాట్లాడేందుకు రావాలని మంత్రి కొండా సురేఖకు, అలాగే పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డికి సీఎం ఆఫీసు నుంచి పిలుపువచ్చింది. దీంతో వారిద్దరు సోమవారం హైదరాబాద్ వెళ్లారు. బిజీ షెడ్యూల్ కారణంగా సీఎం రేవంత్‌రెడ్డి వీరిద్దరిని కలువలేదు. ఒకటిరెండు రోజుల్లో వారిద్దరితో రేవంత్‌రెడ్డి మాట్లాడే అవకాశం ఉన్నట్టు తెలిసింది. మంత్రి సురేఖ తీరుతో రాష్ట్రంలో, ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఇటీవల ప్రభుత్వానికి, అధికార పార్టీకి తలెత్తిన ఇబ్బందులపై సీఎం ప్రత్యేకంగా సమాచారం తెప్పిస్తున్నారని, అందుకే కొన్ని రోజులు సమయం తీసుకుంటున్నారని కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. మంత్రి సురేఖ, ఎమ్మెల్యే రేవూరి మధ్య పంచాయితీ నేపథ్యంలో పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ వీరిద్దరితో ఫోన్‌లో మాట్లాడారు. ఒకే పార్టీ ప్రజాప్రతినిధుల మధ్య ఇలాంటివి జరగడం సరికాదని, వీటితో క్యాడర్‌కు తప్పుడు సంకేతాలు వెళతాయని పేర్కొన్నట్టు తెలిసింది. త్వరలోనే ఇద్దరితో కలిసి మాట్లాడతామని, అప్పటివరకు గొడవలు లేకుండా రెండు వర్గాల వారు సంయమనంతో ఉండాలని ఆదేశించినట్టు సమాచారం. పరకాల నియోజక వర్గంలోని గీసుగొండ మండలం ధర్మారంలో దసరా సందర్భంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీల్లో ఫొటోల విషయమై మంత్రి సురేఖ అనుసరించిన వైఖరిపై సర్వత్రా విమర్శలకు దారితీసింది. కాంగ్రెస్ కార్యకర్తలపైనే కేసులు నమోదు చేయాలని, ఘర్షణకు దిగిన వారిపై పోలీసులు చర్యలు తీసుకోవద్దని మంత్రి సురేఖ గీసుగొండ

పోలీసు స్టేషన్‌కు వెళ్లి ఇన్‌స్పెక్టర్ కుర్చీలో కూర్చొని ఆదేశాలు ఇవ్వడంపై ప్రభుత్వంలో, అధికార పార్టీలో చర్చ జరుగుతున్నది. కాంగ్రెస్ వారిపై కేసులు పెట్టాలని, తాను చెప్పినట్టు వినని పోలీసులను ట్రాన్స్‌ఫర్ చేయాలని మంత్రి సురేఖ బహిరంగంగా పోలీసు ఉన్నతాధికారులను డిమాండ్ చేయడంపై పెద్ద ఎత్తున విమర్శలు వస్తున్నాయి. దసరా సందర్భంగా ఒకచోట జరిగిన చిన్న గొడవలో మంత్రి నేరుగా జోక్యం చేసుకుని పోలీసు స్టేషన్‌కు వెళ్లడం సరికాదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

స్వతంత్ర సంస్థతో హైకమాండ్ విచారణ

ఇటీవల వరుసగా వివాదాస్పద వ్యాఖ్యలతో వార్తల్లోకెక్కుతున్న మంత్రి కొండా సురేఖ వ్యవహారంపై కాంగ్రెస్ అధిష్ఠానం ప్రత్యేకంగా విచారణ చేస్తున్నట్టు తెలిసింది. సినీనటుడు నాగార్జున కుటుంబంపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన కొండా సురేఖపై జాతీయ స్థాయిలో విమర్శలు వ్యక్తమయ్యాయి. మహిళా మంత్రిగా ఉండి, మరో మహిళపై సురేఖ చేసిన ఆరోపణలను అన్ని రాజకీయ పార్టీలు, జాతీయ మీడియా తీవ్రంగా తప్పుబట్టింది. సురేఖపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకత్వంపై అనేక వర్గాలు, ముఖ్యంగా మహిళా సంఘాలు ఒత్తిడి పెంచాయి. దీంతో తెలంగాణ పీసీసీతో సంబంధం లేకుండానే మంత్రి సురేఖ వ్యవహారంపై ఓ స్వతంత్ర సంస్థతో క్షేత్ర స్థాయిలో ఉమ్మడి వరంగల్, హైదరాబాద్‌లో సమాచారాన్ని సేకరిస్తున్నది. ఈ నివేదిక ఆధారంగా జాతీయ నాయకత్వం తగిన చర్యలు తీసుకునే అవకాశం ఉన్నదని కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి.

ఎమ్మెల్యేలతో పడదు..

వరంగల్ ఉమ్మడి జిల్లాలో 12 అసెంబ్లీ స్థానాలకుగాను 11 మంది అధికార పార్టీ ఎమ్మెల్యేలే ఉన్నారు. వరంగల్ తూర్పు నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన మంత్రి సురేఖకు ఉమ్మడి జిల్లాలోని అత్యధిక మంది అధికార పార్టీ ఎమ్మెల్యేలతో విభేదాలున్నాయి. ఉమ్మడి జిల్లా నుంచి మంత్రులుగా ఉన్న సీతక్క, సురేఖ మధ్య ఆధిపత్య పోరు కొనసాగుతున్నది.అయితే ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పెత్తనం నడిపిస్తున్నారు.

కొండా సురేఖపై మాజీ ఎమ్మెల్యే ఫైర్

- పార్టీ వ్యతిరేకులను ప్రోత్సహిస్తున్నారని మండిపాటు
- ఎమ్మెల్యేను అవమానిస్తే పార్టీని ధిక్కరించినట్టే
- తూర్పులో మీ ఫొటో లేకుండా ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తే ఊరుకుంటారా?
- మంత్రి సురేఖను ప్రశ్నించిన మాజీ ఎమ్మెల్యే భిక్షపతి

పరకాల, అక్టోబర్ 14 : మంత్రి కొండా సురేఖ తీరుపై అదే పార్టీకి చెందిన పరకాల మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన వ్యక్తులను మందలించాల్సింది పోయి వారిని మంత్రి కొండా సురేఖ ప్రోత్సహిస్తున్నారని విమర్శించారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యేనే బాస్ అని, ఆయనకు సముచిత స్థానం కల్పించాల్సిందేనని స్పష్టం చేశారు. సోమవారం హనుమకొండ జిల్లా

పరకాలలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గీసుకొండ వర్గపోరుపై మాజీ ఎమ్మెల్యే భిక్షపతి మీడియాతో మాట్లాడారు. గీసుకొండ మండలం ధర్మారంలో చోటుచేసుకున్న ఘటనలో మంత్రి వాస్తవాలను తెలుసుకుని స్పందిస్తే బాగుండేదని, కానీ తప్పు చేసిన వారికి అండగా నిలవడం బాధాకరమని అన్నారు. అదే తూర్పు నియోజకవర్గంలో మంత్రి ఫొటో లేకుండా ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తే కొండా దంపతులు ఊరుకుంటారా? అని ప్రశ్నించారు. పార్టీ కోసం నిరంతరం పనిచేసే కార్యకర్తలకు నాయకులు అండగా నిలవాలని, అనిల్‌పై దాడి చేయడం సరైందికాదని అన్నారు. ఏది ఏమైనా మంత్రిగా ఉన్న కొండా సురేఖ వర్గ పోరును ప్రోత్సహించడం మంచిది కాదని, ఈ విషయాన్ని తాను ఖండిస్తున్నట్టు పేర్కొన్నారు.

శివుడి కన్నా సురేఖ ఎక్కువా?

- వేములవాడ ఆలయ అధికారుల అత్యుత్సాహం
- నైవేద్య సేవ ఆపి మంత్రితో పూజలు
- అరగంట ఆలస్యంగా స్వామివారికి నైవేద్య సేవ
- అధికారుల తీరుపై భక్తుల ఆగ్రహం

వేములవాడ, అక్టోబర్ 14: రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రాజన్న ఆలయ అధికారులు అత్యుత్సాహం ప్రదర్శించారు. దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ కోసం స్వామివారికి అరగంట ఆలస్యంగా నైవేద్యం సమర్పించడంతో భక్తులు మండిపడ్డారు. స్వామివారి సన్నిధిలో మనువడి పుట్టువెంట్రుకల మొక్కులు చెల్లించుకునేందుకు మంత్రి కుటుంబ సమేతంగా సోమవారం రాజన్న ఆలయానికి చేరుకున్నారు. ఆలయ ఎన్టీఆర్ అతిథి గృహంలో పుట్టువెంట్రుకలు సమర్పించాక స్వామివారిని దర్శించుకునేందుకు కుటుంబ సమేతంగా వెళ్లారు. ఆదివారం ఏకాదశి కాగా.. సోమవారం ద్వాదశి సందర్భంగా

స్వామివారికి నైవేద్యాన్ని అరగంట ఆలస్యంగా తీసుకెళ్తున్న అర్చకులు

స్వామివారికి మధ్యాహ్నం 3 గంటలకే నైవేద్యం, అన్నపూజ నిర్వహించాలి. కానీ.. అధికారులు అత్యుత్సాహంతో నైవేద్యాన్ని ఆపి మరీ మంత్రి కొండా సురేఖ దంపతులతో స్వామివారి సన్నిధిలో పూజలు నిర్వహించారు. దీంతో స్వామివారికి అరగంట ఆలస్యంగా (3:30గంటలకు) అర్చకులు స్వామివారికి అన్నపూజ చేసి, నైవేద్యాన్ని సమర్పించారు.

టీఎన్జీవోస్ ఇండ్ల స్థలాల సమస్యను పరిష్కరిస్తాం

- డిప్యూటీ సీఎం భట్టి హామీ

హైదరాబాద్, అక్టోబర్ 14 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌లోని భాగ్యనగర్ టీఎన్జీవోస్ సొసైటీ పరిధిలోని ఇండ్ల స్థలాల సమస్యను పరిష్కరిస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క హామీ ఇచ్చారు. టీఎన్జీవో నేతలు మారం జగదీశ్వర్, ముజీబ్‌హుస్సేన్, ఎం సత్యనారాయణగౌడ్, సత్యనారాయణ సోమవారం డిప్యూటీ సీఎంను కలువగా ఈయన ఈ మేరకు హామీ ఇచ్చారు.

సినీపరిశ్రమ అభివృద్ధికి అండగా ఉంటాం

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

హైదరాబాద్, అక్టోబర్ 14 (నమస్తే తెలంగాణ): తెలంగాణ సినీ పరిశ్రమ అభివృద్ధికి కాంగ్రెస్ సర్కారు అన్నివిధాలా అండగా ఉంటుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పేర్కొన్నారు. సోమవారం సెక్రటేరియట్‌లో గద్దర్ సినిమా అవార్డుల ఎంపిక కోసం విధి విధానాల ఖరారుకు అవార్డుల ఎంపిక కమిటీతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో కమిటీ చైర్మన్ నర్సింగ రావు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీలుగా మరో 12 గ్రామాలు

- పలు జిల్లాల నుంచి ఎంపిక
- సర్పంచ్‌లు లేని కాలంలో పంచాయతీల తీర్మానాలు
- ప్రజలు వ్యతిరేకిస్తున్నా స్థానిక ఎమ్మెల్యేల ఒత్తిడి
- పన్నుల భారం పడుతుందని గ్రామీణుల ఆందోళన

ప్రతిపాదిత మున్సిపాలిటీలు..

- కామారెడ్డి జిల్లా జుక్కల్, బిచ్కుంద
- వరంగల్ జిల్లా ఆత్మకూరు
- మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర
- నారాయణపేట జిల్లా మద్దూరు
- జనగామ జిల్లా స్టేషన్ ఘన్‌పూర్
- సంగారెడ్డి జిల్లా ఇస్నాపూర్
- మహబూబాబాద్ జిల్లా కేసముద్రం

హైదరాబాద్, అక్టోబర్ 14 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో మరికొన్ని గ్రామపంచాయతీలను మున్సిపాలిటీలుగా మార్చి ప్రజలపై పన్ను భారం వేసేందుకు ప్రభుత్వం సిద్ధమవుతున్నది. స్థానిక ఎమ్మెల్యేల ద్వారా ఒత్తిడితెచ్చి సదరు గ్రామాల నుంచి మున్సిపాలిటీల ఏర్పాటుకు అవసరమైన తీర్మానాలను తెప్పిస్తున్నారు. ప్రస్తుతం సర్పంచ్‌లు లేకపోవడం, గ్రామాల్లో పర్సన్ ఇన్‌చార్జిల పాలన సాగుతుండటాన్ని ఆసరాగా చేసుకొని ప్రభుత్వం వడివడిగా అడుగులు వేస్తున్నది. ఆర్థిక లోటుతో సతమతమవుతున్న సర్కారు గ్రామాలను మున్సిపాలిటీలుగా మార్చి, అక్కడి నుంచి పన్ను వసూలు చేసేందుకు ఈ కసరత్తు చేస్తున్నట్టు విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే 12 గ్రామాల నుంచి మున్సిపాలిటీలుగా మార్చేందుకు ప్రతిపాదనలు వచ్చినట్టు సమాచారం. ఆ యా గ్రామాల ప్రజలు మాత్రం ఈ ప్రతిపాదనలను వ్యతిరేకిస్తున్నారు. తమ గ్రామం మున్సిపాలిటీగా మారితే.. ఆస్తి, నల్లా పన్నులు, భవన నిర్మాణాల అనుమతికి పన్ను అంటూ ఆర్థిక భారం మోపుతారని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

ఆ 12 గ్రామాలు ఇవే..

కామారెడ్డి జిల్లా జుక్కల్, బిచ్కుంద, వరంగల్ జిల్లా ఆత్మకూరు, మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర, నారాయణపేట జిల్లా మద్దూరు, జనగామ జిల్లా స్టేషన్ ఘన్‌పూర్, సంగారెడ్డి జిల్లా ఇస్నాపూర్, మహబూబాబాద్ జిల్లా కేసముద్రం సహా మరికొన్నింటిని మున్సిపాలిటీలుగా మార్చేందుకు ప్రతిపాదనలు వచ్చినట్టు తెలిసింది. నిబంధనలకు అనుగుణంగా కొన్ని పంచాయతీలలో జనాభా, ఇతర సదుపాయాలు లేకపోవడంతో మండల కేంద్రంతో పాటు సమీపంలోని ఇతర గ్రామాలను కలిపి మున్సిపాలిటీలుగా మార్చేందుకు ప్రతిపాదనలు తెప్పిస్తున్నారు. మరికొన్ని గ్రామాలను కూడా పట్టణాలుగా మార్చి మున్సిపల్ వ్యవస్థను రుద్దేందుకు పురపాలక శాఖ అధికారులు స్థానిక ఎమ్మెల్యేలతో మాట్లాడుతున్నట్టు సమాచారం.

పన్నుల భారంతో భయం

మున్సిపాలిటీల ముసుగులో తమపై ఆర్థిక భారం మోపడాన్ని గ్రామీణులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. తమ అభిప్రాయానికి వ్యతిరేకంగా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపడంపై అభ్యంతరం వ్యక్తంచేస్తున్నారు. తమ గ్రామం పంచాయతీగానే ఉండాలని డిమాండ్ చేస్తున్నారు. మున్సిపాలిటీకి వచ్చే నిధులన్నీ మున్సిపల్ కేంద్రంగా ఉన్న గ్రామానికే కేటాయిస్తారని, తాము వివక్షకు గురవుతామని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. దీంతో స్థానిక ఎమ్మెల్యేలు రంగప్రవేశం చేసి వారిని బుజ్జిగించడం, అవసరమైతే బెదిరింపులకు పాల్పడుతున్నారని రాజకీయ వర్గాల ద్వారా తెలిసింది. మరో వైపు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో పట్టణ, స్థానిక సంస్థలకు నిధులను విడుదల నిలిచిపోయిందని ప్రతిపక్ష పార్టీలు విమర్శిస్తున్నాయి. పట్టణాల అభివృద్ధిని పట్టించుకోవడం లేదని, ఇక కొత్త మున్సిపాలిటీలను ఏర్పాటుచేయడం వల్ల ఏమి ప్రయోజనమని ప్రశ్నిస్తున్నారు.

మేం తెలంగాణలోనే ఉంటాం!

- క్యాట్‌ను ఆశ్రయించిన పలువురు ఏఐఎస్‌లు
- సీఎస్‌తో భేటీ తర్వాత నిర్ణయం
- నేడు ట్రిబ్యునల్ విచారణ

హైదరాబాద్, అక్టోబర్ 14 (నమస్తే తెలంగాణ): సొంత క్యాడర్‌లో రిపోర్ట్ చేయాలన్న కేంద్ర అంతర్గత శిక్షణ, వ్యవహారాల శాఖ (డీవోపీటీ) ఆదేశాలను సవాలు చేస్తూ పలువురు ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు కేంద్ర పరిపాలన ట్రిబ్యునల్ (క్యాట్)ను ఆశ్రయించారు. ఏపీ, తెలంగాణకు చెందిన మొత్తం 11 మంది ఐఏఎస్‌లు క్యాడర్ మార్చాలంటూ చేసుకున్న దరఖాస్తును ఇటీవల డీవోపీటీ తిరస్కరించిన సంగతి తెలిసిందే. వెంటనే ఏపీ, తెలంగాణ నుంచి రిలీవ్ కావాలని, 16వ తేదీలోగా సొంత క్యాడర్‌లో చేరాలని డీవోపీటీ ఆదేశించింది. ఆదేశాలు అందుకున్నవారిలో తెలంగాణలో పనిచేస్తున్న ఏపీ క్యాడర్ ఐఏఎస్‌లు వాకాటి కరుణ, రొనాల్డ్ రోస్, ఆమ్రపాలి కాట, వాణీప్రసాద్, ప్రశాంతి, ఐపీఎస్‌లు అంజనీకుమార్, అభిలాష బిస్ట్, అభిషేక్ మహంతి ఉన్నారు. ఏపీలో పనిచేస్తున్న తెలంగాణ క్యాడర్ ఐఏఎస్‌లు హరికిరణ్, శ్రీజన, శివశంకర్ ఉన్నారు. అయితే వీరు ప్రస్తుతం పనిచేస్తున్న రాష్ట్రాలను విడిచి వెళ్లేందుకు సిద్ధంగా లేమని చెప్పున్నారు. మరోవైపు డీవోపీటీ ఆదేశించిన ఇరు రాష్ట్రాల సీఎస్‌లు వారిని రిలీవ్ చేయలేదు. ఏపీ క్యాడర్ ఐఏఎస్‌లు వాకాటి కరుణ, రోనాల్డ్ రోస్, ఆమ్రపాలి తదితరులు సోమవారం సచివాయలంలో సీఎస్ శాంతికుమారితో భేటీ అయ్యారు. డీవోపీటీ ఆదేశాలపై చర్చించారు. అనంతరం తెలంగాణ నుంచి ఐఏఎస్‌లు రోనాల్డ్ రోస్, వాకాటి కరుణ, వాణీప్రసాద్, ఆమ్రపాలి, ఏపీ నుంచి శ్రీజన కేంద్ర పరిపాలన ట్రిబ్యునల్‌ను ఆశ్రయించారు. డీవోపీటీ ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేయాలని కోరుతూ నలుగురు వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. తాము ప్రస్తుతం పనిచేస్తున్న క్యాడర్‌లోనే కొనసాగేలా మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని పిటిషన్‌లో కోరారు. ఈ పిటిషన్లపై మంగళవారం క్యాట్ విచారణ చేపట్టనున్నది. డీవోపీటీ విధించిన గడువు బుధవారంతో ముగుస్తుండటంతో క్యాట్ ఆదేశాలపై తీవ్ర ఉత్కంఠ నెలకొన్నది. ఒకవేళ వారికి అనుకూలంగా మధ్యంతర ఉత్తర్వులు వస్తే, మిగతా ఐఏఎస్‌లు కూడా క్యాట్‌ను ఆశ్రయించాలని భావిస్తున్నారట. ఒకవేళ క్యాట్ ఈ పిటిషన్లను తిరస్కరిస్తే బుధవారం 11 మంది ఐఏఎస్‌లు రిలీవ్ కావాల్సి ఉంటుందని అధికారులు చెప్తున్నారు.

దివ్యాంగుల కోసం ఆన్‌లైన్ జాబ్ పోర్టల్

- ప్రారంభించిన మంత్రి సీతక్క

హైదరాబాద్, అక్టోబర్14 (నమస్తే తెలంగాణ) : దివ్యాంగుల కోసం ప్రత్యేకంగా రూపొందించిన జాబ్ పోర్టల్‌ను పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క సచివాలయంలో సోమవారం ఆవిష్కరించారు. అనంతరం మహిళా సంక్షేమ శాఖ డైరెక్టరెట్ హెల్ప్‌లైన్‌లో 10 మందికి అపాయింట్‌మెంట్ ఆర్డర్లు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. దివ్యాంగులకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించేందుకు జాబ్‌పోర్టల్‌ను అందుబాటులోకి తెచ్చినట్టు వెల్లడించారు. దివ్యాంగులు ఈ పోర్టల్‌లో పేర్లు రిజిస్టర్ చేసుకుంటే విద్యార్హతలను బట్టి ఉద్యోగాలు పొందే అవకాశముంటుందని తెలిపారు. కార్యక్రమంలో మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి వాకాటి కరుణ, దివ్యాంగుల సహకార కార్పొరేషన్ చైర్మన్ వీరయ్య, జేడీ శైలజ, దివ్యాంగ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

సీనియర్లతో ఇక అమీతుమీ!

అధిష్ఠానంతో రేవంత్‌కు సంబంధాలు కట్ • వైఫల్యాలను ఢిల్లీకి మోస్తున్న సీనియర్లు

జీర్ణించుకోలేకపోతున్న రేవంత్.. వారిపై గుర్రు • హైడ్రా పేరుతో నేతలకు పరోక్ష హెచ్చరికలు • కేవీపీ ఫాంహౌస్ ప్రస్తావన అందులో భాగమే!

హైదరాబాద్, అక్టోబర్ 14 (నమస్తే తెలంగాణ): అనుమానం పెనుభూతం అంటారు. ఒకసారి అనుమానం మొదలైందంటే దాని పర్యవసానాలు తీవ్రంగా ఉంటాయి. రాష్ట్ర కాంగ్రెస్‌లో ప్రస్తుతం అదే జరుగుత